ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం 9 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

## 14 నుంచి కాంగ్రెస్ విజయోత్సవాలు

**వచ్చేనెల 9 వరకు కార్యక్రమాలు**

అధికారంలోకి వచ్చి డిసెంబర్ 9 నాటికి ఏడాది

హైదరాబాద్, ప్రజాస్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి డిసెంబరు 9 నాటికి ఏడాది పూర్తకావొస్తోంది. ఈ సందర్భంగా ప్రజా విజయోత్సవాలు జరిపేందుకు సిద్ధమవుతోంది. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశాలపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణపై శనివారం జరిగిన సబ్‌కమిటీ భేటీలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. ఈ విజయోత్సవాలు 14 నుంచి డిసెంబరు 9 వరకు జరపనున్నారు. పథకాలు, అభివృద్ధి, చేపట్టిన సంక్షేమం కార్యక్రమాలను ప్రజల్లో పూర్తిస్థాయిలో తీసుకెళ్లాలని భావిస్తోంది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనుంది.



## లక్షా 50 వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు?

**ఎలా తెస్తారో చెప్పాలి**

మూసీ ప్రక్షాళన చేయాల్సిందే

నిజాం హయాంలోనే రిటైనింగ్ వాల్ కట్టారు

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కట్టాల్సిందే

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, ప్రజాస్వరం: మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నిజాం హయాంలోనే మూసీ వెంట రిటైనింగ్ వాల్ కట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రిటైనింగ్ వాల్ కట్టాలని చెప్పారు. ఇది రాష్ట్రప్రభుత్వం .. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కాదు అని అన్నారు. లక్షా 50 వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు? ఎలా తెస్తారో చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. మూసీలో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఎక్కడ పాదయాత్ర చేపట్టడం కాదు.. ధాన్యం కల్లాల దగ్గర పాదయాత్ర చేయాలని హితవు పలికారు.

## గాంధీ కుటుంబానికి ఏటీఎంలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు

**రాజకుటుంబానికి కప్పం కడుతున్నాయి**

**అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం**

**మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఘాటైన వ్యాఖ్యలు**



ముంబయి : కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు.. గాంధీ కుటుంబానికి ఏటీఎంలుగా మారాయని ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ నుంచి..వేల కోట్ల రూపాయలు మహారాష్ట్రకు తరలిస్తున్నారని ఆరోపణలు చేశారు. తెలంగాణ, కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు.. కాంగ్రెస్ రాజకుటుంబానికి కప్పం కడుతున్నారని మోదీ దుయ్యబట్టారు. తెలంగాణ, కర్నాటకలో వసూలు చేసిన డబ్బును మహారాష్ట్ర ఎన్నికల్లో పంచుతున్నారని విమర్శించారు. ఒక కర్ణాటక నుంచే రూ.700 కోట్లు తరలించారని దుయ్యబట్టారు. అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## మూసీ సమస్యలపై పాదయాత్ర

**తాను సిద్ధమేనన్న మాజీమంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**

**హైదరాబాద్, నల్గొండలో ఎక్కడైనా సరే రెడీ అని స్పష్టీకరణ**

హైదరాబాద్, ప్రజాస్వరం: సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నా.. మూసీ సమస్యలపై పాదయాత్రకు నేను సిద్ధమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్, నల్గొండలో ఎక్కడైనా పాదయాత్రకు రెడీ అని వెల్లడించారు.

**కేసీఆర్ రైతుల సీఎం రేవంత్ మాత్రం బూతుల సీఎం**

మెదక్: కొల్చారంలో రైతు గర్జన సభ నిర్వహించగా.. సభకు హాజరై మాజీమంత్రి హరీశ్ రావు మాట్లాడారు. హామీ ఇవ్వకపోయినా కేసీఆర్ రైతుబంధు పెట్టారన్నారు. రైతు బీమా సహా అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. అందుకే కేసీఆర్ రైతుల సీఎం అయ్యారన్నారు. ఆరు గ్యారంటీలు అమలయ్యాయని, మహారాష్ట్రలో రేవంత్ అబద్ధాలు చెప్పారన్నారు. రైతు రుణమాఫీపై ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి రేవంత్ మాట తప్పారని విమర్శించారు. మూసీ మురికికి కారణం టీడీపీ, కాంగ్రెస్ యేనని అన్నారు. రేవంత్ తిట్లకు బీఆర్ఎస్ గుండెలు భయపడవు అని వెల్లడించారు.

## కాంగ్రెస్ గ్యారంటీలపై మోదీ అబద్ధాలు

**సీఎం రేవంత్**

ముంబయి : తెలంగాణలో కాంగ్రెస్ గ్యారంటీలపై మోదీ అబద్ధాలు చెప్పారని, ఆయన అబద్ధాలు చెప్పడం మానకుంటే మేం నిజాలు చెబుతూనే ఉంటాం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

మహారాష్ట్రలో ఆయన ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ గ్యారంటీలపై ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారన్నారు..ఆయన అబద్ధాలు మాటలు చెప్పడం ఆపకుంటే తాము నిజాలు చెబుతామన్నారు. కేంద్రం, మహారాష్ట్ర సర్కార్ రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. నల్లచట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని చూశారన్నారు. తాము రూ.2 లక్షల రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, రూ.500కే వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వరికి రూ.500 మద్దతు ధర, మహిళలకు ఉచిత ప్రయాణంపై మాట నిలబెట్టుకున్నామన్నారు. ఎవరైనా వివరాలు అడిగితే ఇవ్వడానికి సిద్ధం అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



## హుజూరాబాద్ చౌరస్తాలో ఉద్రిక్తత

**రెండో విడుత దళిత బంధు నిధులు విడుదల చేయాలి**

కౌశిక్ రెడ్డి డిమాండ్

పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో ఎమ్మెల్యేకు ఛాతినొప్పి

ఆస్పత్రికి తరలింపు



హుజూరాబాద్, ప్రజాస్వరం : హుజూరాబాద్ చౌరస్తాలో ఉద్రికత్త చోటుచేసుకుంది. దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ ఇక్కడికి చేరుకుని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకొని ఇక్కడికి చేరుకున్న పోలీసులు.. కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకెళ్తుండగా.. మాట్లాడారు. నన్ను చంపేందుకు కుట్ర జరుగుతోందన్నారు. తనచొక్కాను చింపేయాల్సిన అవసరం ఏముందన్నారు.

## గవర్నర్ వివరాలతో సర్వేకు శ్రీకారం

హైదరాబాద్, ప్రజాస్వరం: సామాజిక సాధికారత కోసం ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా కుటుంబాల వివరాలను నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వివరాల సేకరణతో అధికారులు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కలెక్టర్ అనుదీప్తో పాటు ఇతర అధికారులు గవర్నర్ వివరాలను నమోదు చేశారు.

## 2025 ఏడాదికి సెలవులు ఖరారు

హైదరాబాద్, ప్రజాస్వరం: 2025 ఏడాదికి గాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. 2025లో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 23 ఐచ్ఛిక సెలవులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## నేనొస్తే ఎవరైనా రావాలి కదా?

**ధాన్యం కొనుగోళ్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సీరియస్**

యాదాద్రి, ప్రజాస్వరం : ధాన్యం కొనుగోళ్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కలెక్టర్ హనుమంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పోచంపల్లి మండలం గౌస్ కొండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ హనుమంతరావుతో ఫోన్ లో మాట్లాడారు. నేను వస్తే కనీసం ఇక్కడకు ఎవరన్నా రావాలి కదా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ ఆయన కుటుంబసర్వేలో ఉన్నానని తెలిపారు. తహసీల్దార్ ను పంపుతానని వివరించారు.